# "నేను నేనే"

శివరాజు వెంకట సుబ్బారావు
(బుచ్చి బాబు)

ఒకానొక రోజున, అద్దంలో చూసుకొని, నేనొక గొప్ప విషయం కనిపెట్టాను. నేను నేనేననీ, యింకె వర్నీ కాననీ, యీ కొత్త సంగతి నా బ్రతుకునంతటినీ తారుమారు చేసింది. ఇతరులు, తాము, గాంధీవలెనో, హిట్లర్‌వలెనో, వైస్‌రాయ్‌వలెనో, రవీంద్రుని వలెనో, సైగల్‌వలెనో వున్నామని తెలుసుకుంటారు. కాని, నేను నేనేనని, నాఅంతట నేను తెలుసుకోవడం చాలా విచిత్రమైనది.

పరీక్ష ఫలితాలొచ్చాయి. అందులో నాదొకభాగం పోయినట్లు తెలుసుకుని దీనంగా వీధివెంబడి పోతుంటే, వొక ఆసామీ నన్ను పిలిచి "ఏమయింది నీది, పంతులూ?" అని ప్రశ్నించాడు. వొకభాగం పోయిందని చెప్పా. వొకభాగం తప్ప, పూర్తిగా పరీక్ష క్షౌరం చేసుకోవడం, నీకుతప్ప, ఇంకొకడికి సాధ్యమా తుందా!" అని వెళ్ళిపొయ్యాడు. అవును పాపం, నే చెయ్యగలిగినపని అన్యులకెట్లా సాధ్యమౌతుంది?

ఆ రోజున ఆఫీసుకి కొంచెం ఆలస్యంగా వెళ్లా. నాపై అధికారి "రోజూయిల్లా ఆలస్యంగా దయచెయ్యడం, నీకే చెల్లింది" అని కోపించాడు. అవును, యితరులకెల్లా చెల్లుతుంది?

సాయంకాలం, భార్య, తను చెప్పిన రవికలగుడ్డ తీసుకొచ్చావా, అని అడిగింది. "అరరే, మర్చిపోయానుస్మా; రేపు తప్పక తీసుకొస్తా" అన్నాను "మరిచిపోవడం, మీ లక్షణమేగా" అంది ఆమె భర్తని నే కావడం వల్ల, ఆ లక్షణం, ఇంకో భర్తది యెల్లా కాగలదు, యదార్థం పలికింది

"నే నిదివరకల్లా మరిచిపొయ్యానా? వెధవరవికల గుడ్డకోసం, నా మనసుని బాధించడం నీకు తగినపనా?" అన్నామళ్లా

"అవునవును, అల్లా అనడంకూడా మీకే చెల్లింది ఇల్లా అనడంలో మీరు మీరే" అంది నిస్సందేహంగా.

పండగకి అత్తవారింటికెళ్లా. కాఫీగ్లాసులో యీగపడిందని, వేరేగ్లాసుతో యిమ్మనీ కోరేను అత్తగారిని. "అవును, ఈగలూ, దోమలూ నీకుమాత్రం కనిపిస్తాయి. ప్రతిపూటా యేదో పేచీ వెయ్యడంలో, నువ్వు నువ్వే" అంది. పాపం ఆరుగురు అల్లుళ్లతో అనుభవం వున్నా, మా అత్త, నేను నేనేనని, మరో అల్లుణ్ణి కానని గ్రహించలేక పోయింది.

నూటనాలుగు డిగ్రీల జ్వరంతో మంచమెక్కాను. "రాత్రి మందు యెన్నిగంటలకు తాగావు?" అన్నాడు వైద్యుడు.

"పదిగంటలకి"

"అరే, నేను ఎనిమిదింటికే తాగాలని చెప్పలేదు? ఈ ఆలస్యం నీకు తగిందే" అన్నాడు.

"చావకుండా, బ్రతకకుండా, నువ్వు బాధపడి, అన్యులని బాధపెట్టడంలో, నువ్వు నువ్వేనూ, పిచ్చివాడా" అంది నా ఆత్మ పాపం, తుదకు నా ఆత్మకూడా, నేను నేనేనని, యితరుణ్ణి కాలేనని, తెలుసుకోలేక పోయింది.



గౌతమీ గ్రంథాలయము